క్లుప్తంగా

నేటి నుంచి కందుల కొనుగోలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో నేటి నుంచి కందులు కొనుగోలు చేయనున్నట్లు పీఏసీఎస్ సీఈవో ధరం సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటాలుకు రూ.7,550 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి


మాట్లాడుతున్న బొజ్జ ఆశన్న

ఇచ్చోడ: మండలంలోని బోరిగామలో ఇటీవల మృతి చెందిన పంచాయతీ కార్మికుడు బొల్లి రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతోనే మనస్తాపానికి గురై మృతి చెందాడన్నారు. కార్మికుని మృతికి ప్రభుత్వం బాధ్యత వహిస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కార్మిక సంఘం నాయకులు ఉన్నారు.

టెలికాం డైరెక్టర్‌కు సన్మానం

ఇచ్చోడ: ఇటీవల టెలికాం డైరెక్టర్‌గా నియామకమైన సోన్‌కాంబ్లే కృష్ణకుమార్ దంపతులను మంగళవారం దర్మంపూరి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గాయక్వాడ్ గిరిధారి, కాంబ్లే శేషరావు, ముకుందం, మారుతి, యశ్వంత్, చంద్రకాంత్, దశరథ్, నారాయణ్, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

'బాజీరావుబాబా చూపిన మార్గంలో నడవాలి'

తలమడుగు: సద్గురు బాజీరావు బాబా చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖోడత్‌లోని బాజీరావు మహారాజ్ ఆలయంలో దీక్ష దివస్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాబన్న, మాజీ సర్పంచులు సాకి ఆనంద్, క్యాతం గంగమ్మ , దేవస్థాన అధ్యక్షులు మార్కండేయరెడ్డి, బాబు, నాయకులు దేవిదాస్, సంతోశ్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నేరడిగొండ: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 52 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహశీల్దార్ ఎంఏ కలీమ్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో అధికారులు చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఆర్ఐలు నాగోరావ్, సాయిరాం, సిబ్బంది రవి, రాజారామ్, షకీల్, పెద్దలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్‌రూరల్ మండలం మామిడిగూడకు చెందిన కుంట అశోక్ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. సోమవారం మధ్యాహ్నం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న తన బంధువును పరామర్శించేందుకు వచ్చి ఆస్పత్రి ఆవరణలో బైక్ పార్కింగ్ చేసి వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.


బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

తాంసి: అసెంబ్లీ ముట్టడి కార్యక్రమ నేపథ్యంలో తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. మాజీ సర్పంచ్‌లు కృష్ణ, లింబాజీ, అశోక్, రాజన్న, నాయకులు రఘు, రమణ, శంకర్, తదితరులను అదుపులోకి తీసుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మాల సంక్షేమ సంఘ భవనంలో మంగళవారం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల గౌరవ అధ్యక్షుడు ఈదుల్లా శంకర్, అధ్యక్షుడు బొజ్జ లక్ష్మణ్, కోశాధికారి బొజ్జ రాజ్‌కుమార్, నాయకులు బత్తుల ఊశన్న, రొడ్డ ఆశన్న, బత్తుల శివప్రసాద్ పాల్గొన్నారు.

సొనాల తహసీల్దార్‌గా మల్లేశ్



బోథ్: సొనాల తహసీల్దార్‌గా మల్లేశ్ నియమితులయ్యారు. బోథ్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లేశ్‌ను సొనాల తహసీల్దార్(ఎఫ్ఏసీ)గా నియమించారు.

ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు

- అనుమతులు లేకుండా నిర్వహణ
- వాల్టా చట్టానికి తూట్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు


ఉండం గ్రామంలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టి

తలమడుగు: గ్రామాల్లో ఇటుకబట్టీలు ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఆదిలాబాద్ డివిజన్‌లోని తలమడుగు, ఆదిలాబాద్ శివారు ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా ఇటుకబట్టీలు నిర్వహిస్తుండడంతో గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా బట్టీలు నిర్వహిస్తున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. తలమడుగు మండలంలోని ఉండం, కజ్జర్ల, రుయ్యాడి గ్రామ శివారులతో పాటు ఆదిలాబాద్ చుట్టుపక్కల గ్రామాలైన బట్టిసావర్గాం శివారులో పదేళ్లుగా ఇటుకబట్టీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన ఇటుకలను ఆదిలాబాద్, జైనథ్, చుట్టుపక్కల మండలాలకు, సమీపంలో ఉన్న మహారాష్ట్రకు తరలిస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన నిర్వాహకులు ఇక్కడ పనులు కొనసాగిస్తున్నారు. ఇటుకల తయారీకి నల్లమట్టి అవసరం కావడంతో సమీపంలోని చెరువుల నుంచి రాత్రి వేళల్లో ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని డంపు చేస్తున్నారు. చెరువులో మట్టిని తరలించాలంటే తప్పనిసరిగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ అవేం పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నారు.


పంట పొలంలో నుంచి తరలిస్తున్న మట్టి

అనుమతి లేకుండానే..

ఇటుక బట్టీ ఏర్పాటు చేయాలంటే ఎనిమిది శాఖల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వాల్టా చట్టం ప్రకారం ముందుగా గ్రామ పంచాయతీ, రెవెన్యూ, నీటిపారుదల, మైనింగ్, విద్యుత్, కార్మిక, పరిశ్రమల శాఖల నుండి అనుమతి పొందాలి. కానీ ఇవేం లేకుండానే అక్రమంగా కొనసాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అంతేకాకుండా పంటపొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బట్టీలలో మహారాష్ట్ర, ఒరిస్సా నుంచి వచ్చిన కూలీలకు తక్కువ కూలి చెల్లించి వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. బాల కార్మికులతో పనులు చేయిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

అనుమతులు తీసుకోవాలి

గ్రామాల్లో ఇటుక బట్టీలు నిర్వహించే వారు ముందుగా మైనింగ్ శాఖ అనుమతి తీసుకోవాలి. ఆ తర్వాత ఇతర శాఖల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఏశాఖ నుంచి ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. – రాజ్‌మోహన్, తహసీల్దార్, తలమడుగు

'7న సభ విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న సుదర్శన్

ఎదులాపురం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపుమేరకు ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'లక్ష డప్పులు వెయ్యి గొంతులు' సభను విజయవంతం చేయాలని స్థానిక ఖానాపూర్ కాలనీ మాదిగ సంఘం నాయకులు సుదర్శన్ కోరారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ, మాదిగ ఉపకులాలు ప్రతీ ఇంటి నుంచి డప్పుతో హాజరుకావాలన్నారు. వేలాదిగా పాల్గొని ఐక్యత చాటాలన్నారు. సమావేశంలో నాయకులు రాకేష్, ప్రసాద్, ప్రభాకర్, సంతోష్, జాన్సన్, పీటర్, రాఘవ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సఖీ కౌన్సిలర్ లావణ్య

ఆదిలాబాద్‌టౌన్: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సఖీ కౌన్సిలర్ లావణ్య అన్నారు. సఖీ కేంద్రం, మహిళ సాధికారత విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైన పోకిరీలు ఇబ్బందులకు గురిచేస్తే డయల్ 100, 181 లకు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు, గృహహింస చట్టం, పోక్సో, సైబర్‌క్రైమ్ తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర, కేస్ వర్కర్ నాగమణి, వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి, ఉమెన్స్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ టి.స్వప్న, రేఖ, పృథ్వి, గోపాల్, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉద్యమ నాయకుడిని గెలిపించాలి'

ఆదిలాబాద్‌టౌన్: ధన రాజకీయాలను ఓడించి ఉద్యమ నాయకుడిని గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఉద్యమ నేత వై.అశోక్ కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కిష్టన్న, ప్రధాన కార్యదర్శి వి.అశోక్, జిల్లా కార్యదర్శి గౌస్ మొహియుద్దీన్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రామేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నా విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న సిర్ర దేవేందర్

ఎదులాపురం: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం కార్మిక, కర్షక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా చేయడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి, జిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు, సీసీఐ ఫ్యాక్టరీ పునఃప్రారంభం, ఆదిలాబాద్ – ఆర్మూర్ వరకు రైల్వేలైన్ నిర్మాణం, టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో రైతు సంఘాల జేఏసీ నాయకులు లోకారి పోశెట్టి, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్కా దేవిదాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కరదారపు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి సద్దాం

నేరడిగొండ: ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సద్దాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఆశ కార్యకర్తలతో పాటు ఏఎన్ఎంలు ఇంటింటా తిరుగుతూ ఆరోగ్య వివరాలను సేకరించి వారికి వైద్య చికిత్సలు అందించాలన్నారు. ఏవైన వ్యాధులు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు పంపించాలన్నారు. సమావేశంలో హెచ్‌ఈవో పవార్ రవీందర్, వైద్య సిబ్బంది సుధా, దేవిదాస్, సంతోష్, స్వర్ణలత, ఆయా గ్రామాల ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'బడుగులను మోసం చేసేందుకు కుట్ర'


మాట్లాడుతున్న నాయకులు

బోథ్: బడుగులను మోసం చేసేందుకు, రిజర్వేషన్లను కుదించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ధర్మసమాజ్ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన కులగణన రిపోర్టుపై తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. అగ్రకులాల జనాభా 10 శాతం ఉంటే 16 శాతంగా తప్పుడు రిపోర్టు ఇచ్చారన్నారు. ముస్లిం జనాభాను కలుపుకోకుండానే గతంలో 50 శాతానికి మించి ఉన్న బీసీ జనాభాను తగ్గించి కేవలం 46 శాతంగా చూపించారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీల జనాభాను తగ్గించి చూపించారన్నారు. అగ్రకులాలు ఆడుతున్న నాటకమే కులగణన అన్నారు. సర్వే రిపోర్టుని ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు కొండమడుగు గణేశ్, ఉపాధ్యక్షులు కుందూరు సుధాకర్, గొర్రె గంగయ్య, ఆవునూరి అడెళ్లు, కుందూరు రమేశ్, గొర్రె ఊషన్న, మానాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

'మాటిచ్చాను...నిలబెట్టుకున్నాను'


అనిల్ జాదవ్, ఎమ్మెల్యే

బోథ్: ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ సబ్ ప్లాన్ (సీఆర్ఆర్) ద్వారా ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనుల కోసం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. తాను ప్రతిపక్షంలో ఉన్నా, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కొట్లాడి మరీ నిధులు తెస్తున్నానని అన్నారు. నియోజకవర్గంలో ఏ నిధులు మంజూరైనా అధికారికంగా ఎమ్మెల్యే సిఫార్సుతోనే మంజూరవుతాయని అన్నారు. మంజూరైన నిధులతో ఎస్సీకాలనీల్లో సీసీరోడ్లు, కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణం, గుడిహత్నూర్ మండల కేంద్రం నుంచి మాన్కాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్ల 55 లక్షలు, ఇచ్చోడ మండలంలో జున్ని గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి 45 లక్షలు ఎస్డీఎఫ్(ఎస్టీ) నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎస్సై మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న ఆత్రం సుగుణ

ఉట్నూర్‌రూరల్: జన్నారం మండలంలో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న మండల కేంద్రానికి చెందిన రాథోడ్ తానాజీ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ పార్థివదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

'కాంగ్రెస్‌ను గద్దెదించడమే బీజేపీ లక్ష్యం'


తలమడుగు: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


ఇచ్చోడ: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


బోథ్: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తలమడుగు: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని గద్దె దించడమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం అన్నారు. మంగళవారం సుంకిడిలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించలేదనడం సరికాదన్నారు. అనంతరం శబరిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి స్వామి, ఉపాధ్యక్షుడు నక్క ధనుంజయ్, బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షులు దాతాజీ కిరణ్, నాగార్జున రెడ్డి, వెంకట స్వామి, కైలాస్, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, శశికాంత్, రవీందర్‌రెడ్డి, సాయి, పురుషోత్తం, వామన్, శ్రీకాంత్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి లబ్ధి

ఇచ్చోడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వార 95 శాతం పథకాలు తెలంగాణకు లబ్ధి చేకూరుస్తున్నాయని బీజేపీ మండల కన్వీనర్ తాహెరే రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మాదవ్ అమ్టె, గుమ్మడి భీంరెడ్డి, నాయకులు దుక్రే దామోదర్, సంతోష్, పాండు, జాదవ్‌రాము పాల్గొన్నారు.

తాంసి: బడ్జెట్‌లో తెలంగాణకు అత్యధిక నిధులు కేటాయించడాన్ని హర్షిస్తూ బస్టాండ్ వద్ద బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోశ్ రెడ్డి ఆధ్వర్యంలో మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర కిరణ్, సుభాష్, విలాస్, నర్సారెడ్డి, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు రితేశ్ రాథోడ్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కొండేరి రమేశ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

బోథ్: ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని బీజేపీ మండల కన్వీనర్ బోరె రవీందర్ అన్నారు. దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినందుకుగానూ మంగళవారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లాడెవర్ తుకారాం, చామంతుల కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్ , మాజీ ఎంపీటీసీలు మైపాల్, జుగాదిరావు, తదితరులు పాల్గొన్నారు.

శబరిమాత ఆలయ వార్షికోత్సవం


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

తలమడుగు: మండలంలోని సుంకిడిలో మంగళవారం శబరిమాత ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమాత చిత్రపటంతో పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శబరిమాత ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోథ్: బజార్‌హత్నూర్ మండలంలో 33కేవీ విద్యుత్ ఫీడర్‌కు మరమ్మతుల కారణంగా బుధవారం బోథ్ మండలంలోని పొచ్చెర, సొనాల సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మోహియుద్దీన్ ఆశయ సాధనకు కృషి


నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఎస్టీయూ వ్యవస్థాపకులు ముఖ్దూం మోహియుద్దీన్ ఆశయ సాధనకు కృషి చేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మొహియుద్దీన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సంక్షేమానికి, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ముందుండి పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర, రాష్ట్ర సాంస్కృతిక, క్రీడల కన్వీనర్ పుప్పాల నరేందర్, సంఘ బాధ్యులు నూటంకి సత్యనారాయణ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు కాజేసి నగదు విత్‌డ్రా

ఆదిలాబాద్‌రూరల్: ఏటీఎం కార్డు కాజేసి నగదు విత్‌డ్రా చేసిన సంఘటన చోటు చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దస్నాపూర్ కాలానికి చెందిన ప్రవీణ్ కుమార్ మంగళవారం నగదు విత్‌డ్రా కోసం హిమామ్ అలీ బిల్డింగ్‌లోని ఏటీఎంకు వెళ్లాడు. ఏటీఎం కార్డు ఆపరేటింగ్ చేస్తున్న క్రమంలో అక్కడే ఉన్న ఇద్దరు వ్యక్తులు పిన్‌నంబర్ గమనించారు. నగదు విత్ డ్రా చేసి ఇస్తామని చెప్పి ప్రవీణ్ కుమార్ నుంచి ఏటీఎం కార్డు తీసుకున్నారు. ప్రవీణ్ కుమార్ ఏటీఎంను ఆపరేటింగ్ చేయకుండా వారి వద్ద ఉన్న ఏటీఎంను ఆపరేటింగ్ చేసి డబ్బులు రావడం లేదని చెప్పి వారి వద్ద ఉన్న కార్డును ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం వారు పట్టణంలోని మరో ఏటీఎం సెంటర్‌కు వెళ్లి ప్రవీణ్ కుమార్ అకౌంట్ నుంచి రూ.30వేల నగదు విత్‌డ్రా చేశారు. ప్రవీణ్ కుమార్ సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలి'

బోథ్: ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు గోనె రవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ గొర్ల రాజు, మాజీ ఎంపీటీసీ కుర్మే మహేందర్, నాయకులు మేరుగు భోజన్న, గడ్డల నారాయణ, బొజ్జ సాయన్న, దోరశేఖర్, షేక్ షాకీర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడదీసే కుట్ర'

ఎదులాపురం: బీజేపీ ప్రభుత్వం వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడదీసేందుకు కుట్ర చేస్తోందని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 341 ఆర్టికల్ ప్రకారం వర్గీకరణ చేపడితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఎస్సీలపై వివక్ష, అంటరానితనం పోవాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒకే విధమైన రిజర్వేషన్లను తీసుకువస్తే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మనువాద సిద్ధాంతాలను అమలు చేస్తూ, ఆర్థిక వ్యత్యాసాలను పరిగణలోకి తీసుకొని రాజ్యాంగానికి విరుద్ధంగా వర్గీకరణ చేపడుతోందన్నారు. దీనిని దళిత బహుజన వర్గాలు వ్యతిరేకించాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం నాయకులు మల్లన్న, అశోక్, రాఘవేంద్ర, గంగన్న, స్వామి, పోశెట్టి, అర్జున్, ప్రభాకర్, భూమన్న, రాములు, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.